సాక్షి
నిర్మల్
శనివారం, 12, అక్టోబర్, 2024

గరిష్ఠం/కనిష్ఠం
31.0/24.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

దశ మారేనా!?



- జిల్లా ఏర్పడి ఎనిమిదేళ్లు
- ఇంకా నెరవేరని ఆకాంక్షలు
- ఇప్పటివరకు అంతంతే అభివృద్ధి
- విద్య, వైద్యంలో వెనుకంజలోనే..
- కలగానే మిగిలిన రైల్వేలైన్, పరిశ్రమలు
- పాలకులు, అధికారులపైనే ఆశలు

నిర్మల్: నిర్మల్ జిల్లాగా ఏర్పడి ఎనిమిదేళ్లు నిండింది. 2016లో సరిగ్గా దసరా(అక్టోబర్ 11)రోజు కొత్త జిల్లాగా ఏర్పడింది. ఈ ఎనిమిదేళ్లలో జిల్లావాసులు ఆశించిన దాంట్లో సగం కూడా అభివృద్ధి కాలేదు. పుష్కలమైన జలవనరులు, విస్తారంగా పంటలు పండే ప్రాంతమైనా.. ఆర్థికంగా ఇప్పటికీ వెనుకంజలోనే ఉంది. విద్య, వైద్యం వంటి ప్రధాన రంగాల్లో ఇంకా ఆశించిన ప్రగతి రాలేదు. వ్యవసాయానికి అనుబంధంగా పరిశ్రమల జాడలేదు. రవాణా సౌకర్యాల్లో ప్రధానమైన రైల్వేలైన్ నిర్మాణం ఇప్పటికీ కలగానే మిగిలింది. పాలకులు, అధికారులు మారడంతో ఈ విజయదశమి నుంచైనా.. జిల్లా దశ మారాలని జిల్లావాసులు ఆకాంక్షిస్తున్నారు.

ఎనిమిదేళ్లవుతోంది..
రెండు రెవెన్యూ డివిజన్లు, 19 మండలాలతో ఎనిమిదేళ్ల క్రితం విజయదశమి పర్వదినాన్నే జిల్లాగా ఏర్పాటైంది. అంతకుముందు నిర్మల్‌ను జిల్లాగా చేయాల్సిన అవశ్యకతపై 'నిర్మల్ జిల్లా సాధన సమితి'పేరిట ఉద్యమాన్ని చేపట్టారు. వీరికి స్థానిక పాలకుల మద్దతు ఉండటంతో అప్పటి ప్రభుత్వం జిల్లాను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఉమ్మడి ఆదిలాబాద్‌లో మిగతా మూడు జిల్లాలతో పోలిస్తే..నిర్మల్‌లోనే సహజవనరులు, అభివృద్ధికి ఆస్కారమున్న పరిస్థితులు ఉండటంతో ఇక మన ప్రాంతం దూసుకుపోతుందని జిల్లావాసులు ఆశించారు. అందుకు తగ్గట్లు మొదట్లో కొన్నిరంగాల్లో కొంత అభివృద్ధి కనిపించింది. కానీ చాలా రంగాల్లో ఇప్పటికీ ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నచందంగా ఉంది.

ప్రశ్నార్థకంగా పారిశ్రామిక ప్రగతి
గణనీయంగా వ్యవసాయ ప్రగతి ఉన్న జిల్లాలో అందుకు అనుసంధానంగా పరిశ్రమలు ఉండటం సాధారణం. కానీ..జిల్లాలో మాత్రం అలాంటివి ఒక్కటంటే ఒక్కటి కూడా లేవు. ఏడాది క్రితం దిలావర్‌పూర్ మండలంలో ఏర్పాటు చేసిన ఇథనాల్ పరిశ్రమపై స్థానికుల నుంచి వ్యతిరేకత వస్తోంది. సోన్ మండలంలో ఏర్పాటు చేస్తామన్న ఆయిల్‌పామ్ ఇప్పటికీ ముందడుగు పడటం లేదు. ఇక బాసరలో గుర్తించిన ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేస్తామన్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు జాడ లేకుండా పోయాయి.

రైల్వేలైన్ వచ్చేనా..
జిల్లావాసుల దశాబ్దాల కలగా ఉన్న జిల్లా మీదుగా రైల్వేలైన్ నిర్మాణం ఈ ఎనిమిదేళ్లలోనూ ముందడుగు పడలేదు. కేంద్రం, రాష్ట్రం ఎన్నో హామీలు, మాటలు చెప్పినా..ఇప్పటికీ లైన్ మాత్రం రాలేదు. ఏడాదిక్రితం హైదరాబాద్ నుంచి నిర్మల్ మీదుగా ఆదిలాబాద్ వరకు నూతన రైల్వేలైన్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ మధ్య అక్కడక్కడ భూపరీక్షలూ నిర్వహించారు. కానీ..దీనిపై ఎక్కడా స్పష్టత ఇవ్వడం లేదు. ప్రస్తుతం బోధన్–బాసర–భైంసా వరకు కొనసాగుతున్న జాతీయ రహదారిని మహోర్ వరకు పొడిగించాలన్న డిమాండ్ ఉంది. కల్యాణ్ నుంచి నిర్మల్ వరకు గల జాతీయ రహదారిని నాలుగులైన్లుగా పెంచాల్సిన అవసరమూ ఉంది.


2016లో కలెక్టరేట్‌ను ప్రారంభిస్తున్న అప్పటి మంత్రి, కలెక్టర్, ఎస్పీ తదితరులు (ఫైల్)

పాలన చేరువైనా..
జిల్లాగా ఏర్పడిన తర్వాత కలెక్టర్, ఎస్పీ వంటి జిల్లా అధికారులు చేరువయ్యారన్న సంతృప్తి మాత్రమే దక్కింది. ఎనిమిదేళ్ల క్రితం.. జిల్లా ఏర్పడి కొత్తలో జిల్లావాసులు ఆశించినంతగా పాలనలో మార్పులు మాత్రం కనిపించడం లేదు. ఇప్పటికీ మైనింగ్, క్రీడా యువజనశాఖ, టూరిజం, పరిశ్రమలు, ఉపాధి కల్పన తదితర ప్రధాన శాఖల్లోనే సిబ్బంది లేకపోవడం ఇబ్బందిగా మారింది. సాక్షాత్తు జిల్లాకేంద్రమే సరైన రోడ్లు లేక, అస్తవ్యస్తమైన డ్రెయినేజీ వ్యవస్థతో, చెరువుల ఆక్రమణలతో అల్లాడుతోంది. ఇలాంటి పరిస్థితిని నిత్యం చూస్తున్నా.. ఉన్నతాధికారులు స్పందించడం లేదు.

విద్య, వైద్యం మరింతగా..
జిల్లాకేంద్రంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు కావడం మినహా మిగతా వైద్యవ్యవస్థలో ఇప్పటికీ లోపాలు అలాగే ఉన్నాయి. జిల్లా ఆస్పత్రిని జనరల్ ఆస్పత్రిగా మార్చి నెలలు గడుస్తున్నాయి. భైంసా ఏరియా ఆస్పత్రిని జిల్లా ఆస్పత్రిగా ఇప్పటికీ అప్‌గ్రేడ్ చేయలేదు. గతంలో వైద్య వ్యవస్థపై ఉన్న పర్యవేక్షణ ఇప్పుడు కనిపించడం లేదు. విద్యావ్యవస్థలోనూ అవే లోపాలు ఉన్నాయి. రెండుసార్లు పదో తరగతిలో రాష్ట్రంలో ఫస్ట్ వచ్చామన్న గొప్ప తప్పా..సర్కారు బడుల్లో సమస్యలు, ఉపాధ్యాయులపై పర్యవేక్షణ లోపాలు బయటపడుతూనే ఉన్నాయి. ఉన్న ఒక్క పీజీ కాలేజీని అందుబాటులో లేకుండా చేశారు. జిల్లాకు కావాలని అడిగిన ఇంజినీరింగ్ కాలేజీని ఆదిలాబాద్‌కు ఇచ్చారు. మళ్లీ జిల్లాకు కావాలని అడిగేవారే కనిపించడం లేదు. ఇక ఉన్న ఒక్క బాసర ట్రిపుల్‌ఐటీపైనా ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది.

జిల్లా అభివృద్ధే లక్ష్యం



జిల్లాను అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్లాలన్నదే ప్రధాన లక్ష్యం. ఇందు కోసం అన్నిశాఖలు, అన్నివర్గాలతో కలిసి సమష్టిగా పనిచేస్తాం. ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందిస్తూనే..వారికి కావాల్సిన సౌకర్యాల కల్పన కోసం కృషిచేస్తాం. అభివృద్ధి కోసం అందరూ సహకరించాలని కోరుతూ జిల్లాప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు.
– అభిలాష అభినవ్, కలెక్టర్

ప్రశాంతమైన జిల్లా కోసం



నిర్మల్ జిల్లాను ప్రశాంతంగా ఉంచాలన్న ఏకైక లక్ష్యంతో పోలీసుశాఖ పనిచేస్తోంది. శాంతిభద్రతల పరిరక్షణతోపాటు జిల్లా సమగ్ర అభివృద్ధిలోనూ మా వంతుగా భాగస్వామ్యం అందిస్తున్నాం. జిల్లావాసులు కూడా నిర్మల్ జిల్లా నిర్మలంగా ఉండటానికి సహకారం అందించాలని కోరుతూ అందరికీ దసరా శుభాకాంక్షలు.
– జానకీషర్మిల, ఎస్పీ

నేడే విజయదశమి

- ఆలయాలు ముస్తాబు
- వేడుకలకు ఏర్పాట్లు పూర్తి
- పాల్గొననున్న ప్రముఖులు


బంగల్‌పేట్ మహాలక్ష్మి ఆలయ ఆవరణలో రావణ దహనానికి ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నిర్మల్‌టౌన్: చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా, మహిషాసురుడిపై దుర్గామాత విజయం, రావణుడిపై శ్రీరాముడు సాధించిన విజయానికి గుర్తుగా దసరా నిర్వహించుకుంటారు. జిల్లాలో శనివారం విజయదశమి పర్వదినం జరుపుకోనున్నారు. ఇప్పటికే ఆలయాలను ముస్తాబు చేశారు. దసరా వేడుకలకు సంబంధించి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. స్టేజు, లైటింగ్ ఏర్పాట్లు, భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయాల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

ఆయుధ పూజ
దసరా రోజు నిర్వహించే ఆయుధపూజ చాలా విశిష్టమైనది. తమ వృత్తికి సంబంధించిన సామగ్రిని ముఖ్య పరికరాలను అమ్మవారి ఎదుట ఉంచి ఆయుధపూజ నిర్వహిస్తారు.

పాలపిట్ట..
దసరా వేడుకలు నిర్వహించిన అనంతరం పాలపిట్టను చూస్తారు. పాండవులు అరణ్య, అజ్ఞాత వాసాలను ముగించుకొని రాజ్యానికి తిరిగి వస్తుండగా పాలపిట్ట కనిపించిందని, అప్పటినుంచి వారికి విజయాలు కలిగాయని నమ్ముతారు. అందుకే విజయదశమి రోజున పాలపిట్టను చూడడం ఆనవాయితీగా వస్తోంది.

జమ్మిచెట్టు..
పాండవులు అరణ్యవాసం ముగించుకొని అజ్ఞాతవాసానికి వెళ్తూ.. జమ్మిచెట్టు కొమ్మల మధ్య తమ ఆయుధాలు దాచి వెళ్లారని పురాణాలు చెబుతున్నాయి. వనవాసం నుంచి తిరిగొచ్చిన తర్వాత అర్జునుడు జమ్మిచెట్టుపై దాచిన ఆయుధాలను తీసి పూజించి, ఉత్తర గోగ్రహణ యుద్ధం చేశాడని..శత్రువులను జయించి విజయం పొందాడని చెబుతారు. ఆయుధాలకు రక్షణ కల్పించిన జమ్మి చెట్టును అప్పటినుంచి పవిత్రంగా భావిస్తున్నారు.

మహాలక్ష్మి ఆలయం వద్ద ఏర్పాట్లు
జిల్లా కేంద్రంలోని బంగాల్‌పేట్ మహాలక్ష్మి, నందిగుండం దుర్గామాత అమ్మవారి ఆలయాల ప్రాంగణాల్లో దసరా వేడుకలు నిర్వహిస్తారు. మహాలక్ష్మి ఆలయ ప్రాంగణంలో సుమారు రెండు ఎకరాల ఖాళీ స్థలంలో రావణవధ దహన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. స్థలం చదును చేయించారు. ఉత్సవాల నిర్వహణకు వేదిక, లైటింగ్స్, టెంట్లు, బారీకేట్లు, వాటర్ సదుపాయం మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. వీహెచ్‌పీ, బంగల్‌పేట్ ఆంజనేయ యూత్ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణమంతా మామిడి తోరణాలతో అలంకరించారు. రావణ దహన కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలను తిలకించేందుకు ప్రజలు అధికసంఖ్యలో హాజరవుతారు. మహాలక్ష్మి ఆలయ సమీపంలోని దసరా ఏర్పాట్లను ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పరిశీలించారు. ఆలయంతోపాటు నందిగుండం దుర్గామాత ఆలయం వద్ద దసరా వేడుకలు నిర్వహిస్తారు.

కార్యక్రమాల వివరాలు
మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద శనివారం సాయంత్రం 5 గంటలకు ఈ వేడుకలను ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రారంభిస్తారు. కలెక్టర్ అభిలాష అభినవ్ శమీ పూజ చేస్తారు. ఆయుధ పూజను ఎస్పీ జానకి షర్మిల నిర్వహిస్తారు. అనంతరం రావణ దహనాన్ని ఎమ్మెల్యే చేస్తారు. సభాధ్యక్షుడిగా ముప్పిడి రవి వ్యవహరిస్తారు. భరతమాత పూజను వీహెచ్‌పీ ఇందూరు విభాగ్ ధర్మచర్య సంపర్క్ ప్రముఖ్ పతికే రాజేందర్ నిర్వహిస్తారు. అంతకు ముందు వీరందరూ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపడుతారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



బంగాల్‌పేట్ మహాలక్ష్మి ఆలయంలలో ఏటా దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం. ఆలయాన్ని శోభాయామనంగా ముస్తాబు చేశాం. అన్ని ఏర్పాట్లు చేశాం. భక్తులకు ఇబ్బంది అన్ని సౌకర్యాలు కల్పించాం.
– శ్రీకాంత్, బంగాల్‌పేట్ మహాలక్ష్మి ఆలయ చైర్మన్

అన్ని సిద్ధం చేశాం



బంగాల్‌పేట్ మహాలక్ష్మి ఆలయం వద్ద జరిగే దసరా వేడుకలకు అన్ని సిద్ధం చేశాం. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, రావణ దహన కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. ఇక్కడికి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించాం.
– మూర్తి ప్రభాకర్, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి

న్యూస్‌రీల్

బాసరలో నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలి


ఏఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న వీహెచ్‌పీ నాయకులు

భైంసాటౌన్: దుర్గాదేవి విగ్రహాల నిమజ్జనం నేపథ్యంలో బాసర గోదావరి ఘాట్ వద్ద ఏర్పాట్లు చేయాలని వీహెచ్‌పీ నాయకులు కోరారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంతోపాటు ఏఎస్పీ అవినాష్‌కుమార్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాసర గోదావరి నిమజ్జన ఘాట్‌ను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, ఇకనైనా అధికారులు స్పందించి భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఘాట్ వద్ద చెత్త శుభ్రం చేసి, విద్యుత్ దీపాలు, క్రేన్ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే నిమజ్జనం నేపథ్యంలో బందోబస్తు ఏర్పాటు చేయాలని ఏఎస్పీకి విన్నవించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ విభాగ్ కార్యదర్శి తమ్మల కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు గుజ్జుల్‌వార్ వెంకటేశ్, సహ కార్యదర్శి పెరుగు నవీన్, నగర ఉపాధ్యక్షుడు రంగు శ్రీనివాస్, రాజేందర్, రాందాస్, సుధాకర్, రాజు, సాయి, దేవిదాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను ప్రోత్సహిస్తేనే ప్రేరణ


పురస్కార గ్రహీతలతో కార్యవర్గ సభ్యులు

నిర్మల్‌ఖిల్లా: ప్రతిభ కలిగిన వ్యక్తులను గుర్తించి వారికి తగిన ప్రోత్సహిస్తేనే మరింతగా రాణించేందుకు ప్రేరణ ఉంటుందని కుమ్మర ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (కేవా) జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తొడిశెట్టి పరమేశ్వర్, పోతుగంటి సాయన్న అన్నారు. పదో తరగతి, మాధ్యమిక పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు, ఇటీవల ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన అభ్యర్థులు, ఉత్తమ పురస్కారాలు అందుకున్న వారు, వివిధ శాఖల్లో పదోన్నతి పొందిన 32 మందికి జిల్లా కేంద్రంలోని ఆధ్వర్యంలో పెన్షనర్స్ భవన్‌లో శుక్రవారం జిల్లాస్థాయి ప్రతిభా, విశిష్ట సేవా పురస్కారాలు అందజేశారు. సంఘ జిల్లా కార్యవర్గ సభ్యులు, వ్యాపారవేత్త నార్లపురం రవీందర్, నాయకులు కొత్తపల్లి బుచ్చన్న, శిలారి మధు, రవికాంత్, కొత్తపల్లి గంగాధర్, తొడిశెట్టి భోజన్న, గంగన్న, చంద్రయ్య శంకర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యవర్గంలో ఇద్దరికి చోటు


ఏ.మునీందర్ రాజు


వైద్య సుహాసిని

నిర్మల్‌ఖిల్లా: హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన పీఆర్టీయూ టీఎస్ ఉపాధ్యాయ సంఘం 35వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన ఇద్దరికి రాష్ట్ర కార్యవర్గంలో చోటు దక్కింది. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఏ.మునీందర్ రాజు, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలుగా వైద్య సుహాసిని ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తోట నరేంద్ర బాబు, రమణారావు తెలిపారు. నిర్మల్ అర్బన్ మండలం నుంచి ఇద్దరు టీచర్లకు రాష్ట్ర కార్యవర్గంలో స్థానం లభించడం పట్ల మండల అధ్యక్షుడు బల్స గజ్జారం, ప్రధాన కార్యదర్శి సగ్గం స్వామి, కార్యవర్గ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

దేవరకోట పాలకవర్గం ప్రమాణస్వీకారం


ప్రమాణ స్వీకారం చేసిన పాలకవర్గసభ్యులు

నిర్మల్: జిల్లాకేంద్రంలోని చారిత్రక దేవరకోట శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానం నూతన పాలకవర్గం శుక్రవారం సాయంత్రం ప్రమాణస్వీకారం చేసింది. చైర్మన్‌గా కొండ శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులుగా గుల్లె రాజన్న, అరె చిరంజీవి, చెటపెల్లి సంతోష్, వొడ్నం నరేందర్, జాదవ్ అనిత, మోత్కూరి దేవేందర్‌గౌడ్‌లు ప్రమాణం చేశారు. మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ భీంరెడ్డి దేవాదాయశాఖ, ముఖ్యఅధికారిగా ఇన్‌స్పెక్టర్ రాజమౌళి, ఆలయ ఈవో భూమయ్య తదితరులు పాల్గొన్నారు.


వినాయక్‌నగర్ కాలనీలో బతుకమ్మలతో మహిళలు, యువతులు

వెళ్లిరా బతుకమ్మ..

- ఆటపాటలతో మార్మోగిన జిల్లాకేంద్రం


బతుకమ్మలతో యువతులు

నిర్మల్‌ఖిల్లా: రామ రామ రామ ఉయ్యాలో.. రామనే శ్రీరామ ఉయ్యాలో.. ఒక్కేసి పువ్వేసి చందమామ అంటూ తీరొక్క పాటలతో ఊరూవాడ మార్మోగింది. జిల్లా కేంద్రంలో శుక్రవారం సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వినాయకనగర్, శ్రీనగర్, దివ్యనగర్, ప్రియదర్శినినగర్ తదితర కాలనీల్లో మహిళలు, యువతులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి గౌరమ్మకు పూజలు చేశారు. కూడళ్ల వద్దకు చేరుకుని బతుకమ్మల చుట్టూ వలయాకారంలో తిరుగుతూ లయబద్ధంగా చప్పట్లు కొట్టారు. అనంతరం ఆడిపాడారు. బియ్యపు పిండి, వేపపండ్లతో తయారుచేసిన నైవేద్యాన్ని బతుకమ్మకు సమర్పించారు. అనంతరం సమీపంలోని చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

పునరావాస కాలనీ సమస్యలు పరిష్కరిస్తా

- ఖానాపూర్ ఎమ్మెల్యే, వెడ్మ బొజ్జు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

కడెం: మండలంలోని రాంపూర్, మైసంపేట్ పునరావాస కాలనీ సమస్యలను పరిష్కరిస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పేర్కొన్నారు. శుక్రవారం పునరావాస కాలనీని ఆయన సందర్శించారు. నూతనంగా ఏర్పాటు చేసిన హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం కాలనీవాసులతో సమావేశమై సమస్యలను తెలుసుకున్నారు. పునరావాస కాలనీ సమస్యలను అటవీశాఖ మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్తానన్నారు. కాలనీల్లో కమ్యూనిటీ, పాఠశాల భవనాలు నిర్మాణం పూర్తిచేయిస్తానని తెలిపారు. తర్వాత లింగాపూర్, సారంగపూర్ గ్రామాల్లో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహాలకు పూజలు నిర్వహించారు. మినీ అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని టీచర్లు పద్మ, గంగామణి ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. ఇందులో మండల అధ్యక్షుడు మల్లేశ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, చంద్రశేఖర్, గొళ్ల వెంకటేశ్, ఇందూర్‌నేత, కోల శ్రీనివాస్, భూమేశ్, రాజు, సలీం, బబ్లూ, సత్యం, ప్రవీణ్, శంకర్, భూషణ్ తదితరులు ఉన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు


సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి
- సారంగపూర్‌లో సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభం

సారంగపూర్: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో శుక్రవారం సోయా కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు పంటలను విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. క్వింటాల్ సోయా పంటకు రూ.4280 మద్దతు ధర ఇస్తోందని అన్నారు. ఇప్పటికే చాలామంది పంటలను సేకరించి ఆరబెట్టే పనుల్లో ఉన్నారని, ఇంకా కొందరు మహారాష్ట్రకు వెళ్లి విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. పంటలను పొరుగు రాష్ట్రాలకు తరలించి విక్రయించుకోవద్దన్నారు. కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ అధ్యక్షుడు అయిర నారాయణరెడ్డి, నాయకులు మంతెన గంగారెడ్డి, విలాస్. రాంశంకర్‌రెడ్డి, పోతన్న, తిరుమల చారి, మధు, భోజన్న, తదితరులు పాల్గొన్నారు.

'యూబిట్'లోకి ఈడీ ఎంట్రీ!

- జిల్లా పోలీసులకు లేఖ
- పూర్తి వివరాల కోసం ఆరా
- పండుగ తర్వాత వేగవంతం
- జిల్లాలో మళ్లీ టెన్షన్.. టెన్షన్



నిర్మల్: రాష్ట్రవ్యాప్తంగా సంచనలం రేకెత్తించిన, జిల్లాను కుదిపేసిన యూబిట్ దందా కేసు మరో ఊహించని మలుపు తీసుకుంటోంది. ఈ కేసులోకి ఈడీ అడుగుపెడుతుండటంతో మరింత సంచలనంగా మారింది. క్రిప్టో కరెన్సీలో పెట్టుబడుల పేరిట చైన్ లింకును జిల్లాలో విస్తరించి రూ.కోట్లలో దందాను నడిపిన తీరును ఎస్పీ జానకీషర్మిల ఆధ్వర్యంలో పోలీసులు వెలుగులోకి తీసుకువచ్చారు. ఈ దందాను విస్తరించడంలో కీలకంగా వ్యవహరించిన ఐదుగురిని ఏకకాలంలో అదుపులోకి తీసుకుని విచారించారు. ఆ తర్వాత మరో ముగ్గురిని అదుపులో తీసుకుని రిమాండ్‌కు పంపించారు. రూ.కోట్లలో కొనసాగిన ఈ దందాను నిర్మల్ పోలీసులు వెలికి తీసినప్పటి నుంచి కేంద్రం నిఘా సంస్థలు ఆరా తీస్తూ వచ్చాయి. ఇందులో మనీలాండరింగ్, హవాలా జరిగిందన్న అనుమానాల నేపథ్యంలో తాజాగా ఈడీ ఈ కేసులోకి ఎంటరవుతోంది. ఈమేరకు పూర్తి వివరాలు ఇవ్వాలంటూ ఇటీవల జిల్లా పోలీసులకు లేఖ రాసింది.

ఈడీ రంగప్రవేశం
ఎక్కడో విదేశాల్లో ఉంటూ ఇక్కడ క్రిప్టో కరెన్సీ పేరిట ఫేక్‌యాప్ ద్వారా దందా చేస్తున్నట్లు గుర్తించిన పోలీసులు పెట్టిన కేసుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పూర్తి వివరాలు తీసుకుంటోంది. ఈమేరకు జిల్లా పోలీసులకు రాసిన లేఖలో దందా కార్యకలాపాలతోపాటు బ్యాంకు ఖాతాలు, లావాదేవీలు తదితర పూర్తి వివరాలను కోరింది. వీటి ఆధారంగా దసరా తర్వాత నుంచి విచారణ ప్రారంభించనున్నట్లు తెలిసింది. యూబిట్ కేసులోకి ఈడీ అడుగు పెట్టడంతో ఈ దందాలో కీలకంగా ఉన్న 'స్టార్లు', పెట్టుబడి పెట్టినవాళ్లు కలవరపడుతున్నారు. అత్యాశకు పోయి పెట్టుబడులు పెట్టిన ఈ దందా ఏ మలుపు తీసుకుంటుందో తెలియడం లేదని కంగారు పడుతున్నారు.

వివరాలు అందిస్తాం
జిల్లాలో జరిగిన యూబిట్ దందా కేసుకు సంబంధించిన వివరాలను కావాలని ఈడీ అడిగింది. ఈమేరకు కేసు వివరాలను త్వరలోనే వారికి అందిస్తాం.
– జానకీషర్మిల, ఎస్పీ

రెండునెలలుగా..
జిల్లాలో చాపకింద నీరులా ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులతో యూబిట్(యూనిటీమెటా టోకెన్) క్రిప్టో కరెన్సీ అంటూ యాప్ ద్వారా దందాను గుట్టుగా సాగిస్తూ వచ్చారు. ఇందులో లాభాలు అధికంగా కనిపించడంతో సభ్యుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. దీంతో దీనిపై నజర్‌పెట్టిన జిల్లా పోలీసులు ఆగస్టు 31న ఒక్కసారిగా షాకిచ్చారు. అదేరోజు ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ దందాలో కీలకంగా ఉన్న కడెం మండలం నవాబ్‌పేట్‌కు చెందిన రిటైర్డ్ ఆర్మీ జవాన్ సల్లా రాజ్‌కుమార్, నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ఎక్సైజ్ ఎస్సై గంగాధర్, దస్తురాబాద్ మండలం రాంపూర్‌కు చెందిన టీచర్ బూస సాయికిరణ్, కడెం మండలం గంగాపూర్ స్కూల్ టీచర్ కండెల నరేశ్, నిర్మల్‌లో ఆర్మ్‌డ్ రిజర్వు కానిస్టేబుల్‌గా ఉన్న మహేశ్‌లను అదుపులోకి తీసుకుని విచారించారు. మళ్లీ సెప్టెంబర్ 24న ఖానాపూర్‌కు చెందిన ఉపాధ్యాయుడు దాసరి రమేశ్, జిల్లా కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు కైరం వెంకటేశ్‌గౌడ్, ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం సొనాలకు చెందిన ఉపాధ్యాయుడు బొమ్మిడి ధనుంజయ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈనెల 3న ఐదుగురికి హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది.

పేకాట స్థావరంపై దాడి


మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చెత్లాపూర్ సమీపంలో పేకాట స్థావరంపై ఎస్సై రాజశేఖర్ శుక్రవారం తన సిబ్బందితో దాడి చేశారు. ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.15,720 నగదు, ఐదుసెల్‌ఫోన్లు, ఐదు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

కొండచిలువ హతం

కుంటాల:మండలంలోని ఓలా శివారులో వ్యవసాయ పనులు చేస్తుండగా కనిపించిన కొండ చిలువను రైతులుశుక్రవారం హతమార్చారు. కుంటాలకు చెందిన గొల్ల నవీన్, ఒడ్నం రమేశ్ సోయా పంట నూర్పిడి చేసే క్రమంలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్నారు. ఈక్రమంలో వారికి కొండచిలువ కనిపించడంతో హతమార్చారు. సుమారు 7ఫీట్ల ఎత్తు, 15కిలోల బరువు ఉందని రైతులు తెలిపారు.











రూ.10.. పరేషాన్..!

- మార్కెట్లో తగ్గిన కరెన్సీ నోట్ల చెలామణి
- ఇబ్బందుల్లో వ్యాపారులు, ప్రజలు



పది రూపాయల నోటు

నెన్నెల: మార్కెట్లో రూ.10 నోటు కనిపించడం గగనంగా మారింది. దీంతో అటు వ్యాపారులు.. ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సాధారణ కొనుగోళ్లకు 1, 2, 5, 10 రూపాయల నాణేలు గతంలో చాలా చెలామణిలో ఉండేవి. ధరల పెరుగుదల కారణంగా 1, 2, 5రూపాయల నాణేలు ఉన్నా 5, 10రూపాయల నాణేల వినియోగం పెరి గింది. ప్రస్తుతం ఆయా నాణేలతోపాటు రూ.10 నో ట్ల చెలామణి కూడా భారీగా తగ్గింది. వ్యాపారులు ఏదైనా వస్తువు విలువ చెప్పేటప్పుడు రూ.5కు రెండు, రూ.10కి మూడు అని చెబుతున్నారు. దీంతో కి రాణ, ఫ్యాన్సీ, కూరగాయలు, బస్సు, ఆటో చార్జీల్లో రూ.10 కరెన్సీ నోటుకు ప్రాధాన్యం పెరిగింది. ప్రస్తుతం రూ.10 నోటు మార్కెట్‌లో అందుబాటులో లేక వ్యాపారులు ఇక్కట్లకు గురవుతున్నారు.

ఆన్‌లైన్ చెల్లింపులు

కరోనా తర్వాత డిజిటల్ చెల్లింపులు పెరిగాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహిస్తున్నాయి. దీంతో అన్ని వర్గాల ప్రజలు ఆన్‌లైన్ చెల్లింపులకు అలవాటుపడ్డారు. ఏ దుకాణానికి వెళ్లి నా, ఏ వస్తువు కొనుగోలు చేయాలన్నా డిజిటల్ చెల్లింపులు అనే పరిస్థితి నెలకొంది. వీధి వ్యాపారులు, చిన్న దుకాణాల్లో, చిన్నపాటి చెల్లింపులకు ఫోన్‌పే, గూగుల్‌పే వంటివి ప్రత్యేకంగా వ్యాలెట్ రూపంలో సులభతర చెల్లింపులకు అనుమతిస్తున్నా రు. దీంతో రూ.5, రూ.10 లావాదేవీలకు కూడా వినియోగదారులు నోట్లు ఇవ్వడం లేదు. క్రమంగా రూ.10 నోటు బదలాయింపు జరగకపోవడం వల్ల వ్యాపారులు, వినియోగదారుల వద్ద అందుబాటులో లేకుండా పోయింది. మార్కెట్‌లో ప్రస్తుతం చిరి గిన రూ.10 నోట్లు దర్శనమిస్తుండడం గమనార్హం.

ఎక్కడ ఆగిందో..?

రూ.10 నోటు మార్కెట్‌లో చెలామణి తగ్గడంలో అసలు సమస్య ఎక్కడ ఉత్పన్నమైందో అర్థం కా ని పరిస్థితి ఏర్పడింది. వ్యాపారులు సైతం ఈ పరిస్థితిపై ఓ అంచనాకు రాలేకపోతున్నారు. వినియోగదారులు చిరు వ్యాపారుల వద్ద వస్తువులు కొనుగోలు చేసినప్పుడు రూ.100 నోటు ఇస్తే వ్యాపారులు తిరిగి ఇవ్వాల్సిన చిల్లరకు నానా అవస్థలు పడుతున్నారు. గతంలో రూ.1, రూ.2 చెల్లింపులకు బదులుగా చాక్లెట్లు, బిస్కెట్లు వంటివి ఇచ్చేవారు. కానీ రూ.10లకు ఏమి ఇవ్వాలని వ్యాపారులు ఆలోచనలో పడ్డా రు. ఇస్తే వినియోగదారుడు ఎలా స్పందిస్తారనే ఆందోళన వారిలో నెలకొంది. భారీ మొత్తాల చెల్లింపుల విషయంలో పరిస్థితి భిన్నంగా ఉంది. పెద్ద మొత్తంలో లావాదేవీలకు డిజిటల్ చెల్లింపులు జరిగితే వినియోగదారులు, వ్యాపారులు పన్నుల పరిధిలోకి వస్తామని ఆందోళన చెందుతుండడమే ఈ పరిస్థితికి కారణం. చిన్నమొత్తాల చెల్లింపుల కారణంగా కొన్నిసార్లు యూపీఐ సర్వర్‌లపై భారం పడి పని చేయని పరిస్థితి నెలకొంటోందని వ్యాపారులు చెబుతున్నారు.


నోట్ల కొరత వాస్తవమే

రూ.10 నోట్ల కొరత ఉన్న మాట వాస్తవమే. రిజర్వు బ్యాంకు నుంచి రావడం లేదు. రూ.20, రూ.50, రూ.100 నోట్లు మాత్రమే వస్తున్నాయి. రూ.10 నోట్లు రావడం లేదు. నాణేలు మాత్రం అందుబాటులో ఉన్నాయి. అవి చెల్లుబాటులో ఉన్నాయని ప్రజలు గమనించాలి. – **గోపికృష్ణ, తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్, ఆవుడం**

కొత్త పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జైపూర్: సింగరేణి అధికారులు, ఉద్యోగులు కొత్త పరి/్ఞాన్ని అందిపుచ్చుకుంటూ సంస్థకు మరింత లాభాలు వచ్చే విధంగా కృషి చేయాలని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్, ఇందారం, ఓసీపీ అధికారులతో కలిసి సందర్శించారు. 'ఉజ్వల సింగరేణి–ఉద్యోగుల పాత్ర' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐకే–1ఏ గనిపై నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ వంశీకృష్ణ, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. డీ.రాజశేఖర్‌రావు, ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, జీఎంలు శ్రీనివాసులు, సంజీవరెడ్డి, ఓఅండ్‌ఎం జైన్‌సింగ్ పాల్గొన్నారు.





బాసరలో భక్తుల సందడి



బాసర: బాసరలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో శుక్రవారం భక్తుల సందడి నెలకొంది. ముందుగా గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించి మొక్కు చెల్లించుకున్నారు. అక్షరాభ్యాస మండపాల్లో చిన్నారులతో అక్షర శ్రీకార పూజలు చేయించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. దర్శనం అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ అనువంశిక చైర్మన్ శరత్ పాఠక్, స్థానాచార్యుడు ప్రవీణ్ పాఠక్, ప్రధాన అర్చకుడు సంజీవ్ ఆధ్వర్యంలో ఈవో విజయరామరావు ఏర్పాట్లు చేశారు.



దాడి కేసుల్లో ఎనిమిది మంది అరెస్టు

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని హమాలీవాడ, సప్తగిరికాలనీ, అశోక్‌రోడ్‌లో దాడుల కు దిగిన ఎనిమిది మందిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. శుక్రవారం రాత్రి స్థానిక పోలీసుస్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. చర్చి సమీపంలో మహిళలు బతుకమ్మ ఆడుతుండగా శ్రావణ్, వంశీలపై మద్యంమత్తులో శరత్, సురేష్, అనిరుధ్, అఖిల్ మరికొందరు దాడి చేశారని తెలిపారు. సప్తగిరికాలనీలో ప్రేమ వ్యవహారానికి సంబంధించి తోట తిరుపతిపై అగ్గ మారుతితోపాటు మరికొందరు దాడి చేశారన్నారు. అశోక్‌రోడ్‌లో అప్పు వ్యవహారానికి సంబంధించి కోపం పెంచుకుని సోహెల్‌పై రాజు, శ్రావణ్, చిలుక సాయి మరికొందరు మద్యం మత్తులో దాడిచేసి అతడి కారు అద్దం ధ్వంసం చేశారని తెలిపారు. ఈ మూడు కేసుల్లో బాధితుల ఫిర్యాదు మేరకు శరత్, సురేష్, అనిరుధ్, అఖిల్, మారుతి, రాజు, శ్రావణ్, సాయిలను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. పండుగ పూట మద్యంమత్తులో, పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని దాడులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. ఎస్సైలు సనత్‌రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.



కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోవాలి


ఫౌల్ట్రీని ప్రారంభించి రైతుతో మాట్లాడుతున్న ఫైజాన్ అహ్మద్

దిలావర్‌పూర్: అర్హులందరూ కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ కోరారు. మండలంలోని సిర్గాపూర్ గ్రామంలో ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద రూ. 20 లక్షల రుణంతో నిర్మించిన కోళ్ల ఫౌల్ట్రీని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో వ్యాపారం చేయాలనుకునే వారికి 35 శాతం వరకు రాయితీ లభిస్తుందన్నారు. గరిష్ఠంగా రూ.20 లక్షలు రుణం పొందవచ్చని పేర్కొన్నారు. స్వయం ఉపాధి కోసం అర్హులందరూ ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రీజనల్ మేనేజర్ శ్రీనివాస్, లీడ్ జిల్లా మేనేజర్ రాంగోపాల్, ఇండస్ట్రీస్ జిల్లా మేనేజర్ నరసింహారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్, రైతులు పంతిక ప్రవీణ్, పంతిక అజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ గంగారెడ్డి తదితరులు ఉన్నారు.

సమాజ సంఘటితం కోసం పనిచేయాలి

భైంసాటౌన్: హిందూ సమాజం సంఘటితం కోసం ప్రతి సంఘ సేవకుడు కృషి చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ వందో సంవత్సరంలోకి అడుగిడిన సందర్భంలో పట్టణంలోని గాంధీగంజ్‌లో శుక్రవారం విజయదశమి ఉత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే రామారావు పటేల్, హిందూ జాగరణ్ మంచ్ అఖిల భారతీయ సహ సంఘటన మంత్రి పెడబల్లె దేవేందర్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘ్ వందో సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా ప్రతి సంఘ సేవకుడు పంచ పరివర్తన్ సూత్రాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డా.అనిల్ జాదవ్, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సహ సంఘ్‌చాలక్ కృష్ణదాస్, సంఘ కార్యకర్తలు పాల్గొన్నారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్



